# మత్సువో బషో

# హైకూ యాత్ర



ఎమెస్కో

## వరుసగా...


ఎందుకంటే 5

సంపాదకీయం 6

బషో చేసిన ప్రయాణం 9

హైకూ యాత్ర

1. గాలి వానలకు ఎదురీదుతూ 29
2. కషిమకు వెళ్లినప్పుడు 43
3. అలసిపోయినవాడి ఆరణ్యకం 51
4. సరషిన జ్ఞాపకాలు 71
5. ఇరుకుదారిన లోపలిదేశానికి 77
6. సగ దినచర్య 121
7. మరికొన్ని కవితాత్మక గద్యలు 135



# గాలి వానలకు ఎదురీదుతూ

'ప్రాచీన కాలం నుండీ ఎందరు ప్రపంచాన్ని పరిత్యజించి ఈ కొండల్లో అడుగుపెట్టి చీనా కవితలోకి జారుకున్నారో, జపనీయ కవితలో శరణార్థులై తలదాచుకున్నారో.'

**ఒ**కప్పుడొక చీనా సాధువు ఏ సామగ్రీ సమకూర్చుకోకుండానే వేలయోజనాల ప్రయాణం చేశాడనీ, ఒకానొక పరిపూర్ణమైన ఒక వెన్నెలరాత్రి శూన్యత్వసిద్ధి సాధించాడనీ అంటారు. నేను కూడా ఆయన బాటనే అనుసరించాను. జోక్యోశకం మొదటి సంవత్సరం ఎనిమిదో నెల రాగానే సుమిద నది ఒడ్డున నా పాత ఇల్లు వదలిపెట్టేశాను. శరత్కాలపు గాలి అసాధారణంగా చలి పెడుతూ, రొదపెడుతూ ఉంది.

శుష్కించిన దేహం
గుండె లోతులకీ
కోత పెడుతున్న గాలి

హేమంతం, పదేళ్లు:
ఇప్పుడు నీ పాత ఇల్లు ఏదంటే
ఎడొను చూపిస్తాను

నేను సరిహద్దు దాటే రోజు నాటికి అంతా వాన. పర్వతాగ్రాలన్నిటినీ మేఘాలు కప్పేశాయి.

మంచువాన:
అగోచర ఫ్యుజి పర్వతం
మరీసమ్మోహనం

చిరి అనే కుర్రవాడు నాకు అనుచరుడుగా, సహాయకుడుగా వెంట వచ్చాడు. నా సంరక్షణ బాధ్యత పూర్తిగా తన చేతుల్లోకి తీసుకున్నాడు. మా ఇద్దరి మధ్యా అనుబంధం బలపడింది. స్నేహంలో అతడెంతో నమ్మదగ్గవాడు. అతడిట్లా కవిత రాశాడు:

ఫుకగవ –
మా గురువు పర్ణశాల
ఫ్యుజి పర్వతానికి అప్పజెప్పాను

ఫ్యుజి నది ఒడ్డున సాగిపోతున్నప్పుడు ఒకచోట ఎవరో వదలిపెట్టి వెళ్లిపోయిన శిశువును చూశాను. ఆ బిడ్డకు రెండేళ్ల వయసు కూడా ఉండదు. జాలి గొలిపేటట్టుగా ఏడుస్తోంది. ఈ నదీతరంగాల్లానే తీవ్రంగా ఒడిదుడుకులకులోనైన ఈ అస్థిరప్రపంచాన్ని తట్టుకోలేక అతడి తల్లిదండ్రులు ఇక్కడ వదలిపెట్టేశారా? ఈ బిడ్డ జీవితం కూడా అశాశ్వతంగా మంచులాగా కరిగిపోవాలని కోరుకున్నారా? చలిగాలిలో నేలరాలిన పూలతీగలానో లేదా ప్రాతఃకాలవేళకు వాడిపోయిన రాత్రిలతలానో ఆ బిడ్డ కనిపించాడు. నేను నా దగ్గరున్న కొద్దిపాటి ఆహారం ఆ బిడ్డకు పట్టి వదలిపెట్టి వెళ్లిపోతూ ఇట్లా అన్నాను.

కోతుల బాధకే చలించిన కవి
ఈ హేమంత ఝంఝులో
బిడ్డ గురించి ఏమంటాడో

ఇదిలా ఎందుకు జరిగింది? నిన్ను నీ తండ్రి ద్వేషించాడా? నీ తల్లి నీ పట్ల నిర్లక్ష్యం వహించిందా? నిజం చెప్పాలంటే నీ తండ్రి నిన్ను ద్వేషించలేదు. నీ తల్లి నిన్ను నిర్లక్ష్యం చేయలేదు. నీ పరిస్థితికి సమాధానం చెప్పవలసింది పైవాడు మాత్రమే.

మేము ఓయి నది దాటవలసిన రోజున పొద్దుణ్ణుంచి రాత్రి దాకా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

హేమంతవర్షం:
ఎడొలో మమ్మల్ని తలచుకుంటూ
రోజులు లెక్క పెడుతూంటారు

గుర్రంమీద ప్రయాణమవుతూ ఇట్లా అన్నాను:

దారిపక్క గడ్డిపూలు
నలిగిపోయాయి
గుర్రం కాళ్లకింద

కృష్ణపక్షచంద్రుడు ఆకాశంలో పేలగా కనిపిస్తూ ఉన్నాడు. పర్వతసానువులింకా చీకటిగా ఉన్నాయి. కోడికూతకు తెల్లవారకముందే మేమెన్నో మైళ్లు గుర్రం మీద ప్రయాణించాం. దు-ము రాసిన ప్రభాతప్రయాణం కవితలో లాగా, నేను కూడా ఒక కలలోలాగా ప్రయాణిస్తూ సయొ-నొ-నకయమ దగ్గరకు రాగానే హఠాత్తుగా మెలకువలోకి ఉలిక్కిపడ్డాను.

గుర్రంమీద కునికిపాటు
కలలు, దూరంగా జాబిల్లి
తేనీటి ఆవిరి

ఇస్సెలో ముతుస్బయ-పూబకు ఇంటికి వెళ్లి పదిరోజులు అక్కడే గడిపేశాను. రాత్రి కాగానే ఊరి పొలిమేరల్లో ఉన్న మందిరానికి పోయి అర్చనలు సలిపాను. దేవాలయమందిర ప్రథమద్వారం నీడలో నిలిచిఉంది. అక్కడక్కడా పవిత్రదీపాలు వెలుగుతూ ఉన్నాయి. దూరపర్వతశిఖరాలమీంచి పైన్‌చెట్ల గాలి దేహాన్ని చీలుస్తూ లోపల హృదయాన్ని కదిలించివేస్తోంది.

మాసాంతం, జాబిల్లి లేదు
తుపానుగాలి కౌగిలింతలో
వెయ్యేళ్ల దేవదారు

నేనిప్పుడే ఆయుధమూ ధరించలేదు. నా మెడకొక జోలె మాత్రమే ఉంది. నా చేతిలో పద్దెనిమిది రుద్రాక్షల మాల. ఒకవైపు నేనొక ఆచార్యుడిగానే కనిపిస్తున్నప్పటికీ ప్రపంచధూళి నన్నింకా ఆవరించే ఉంది. మరొకవైపు నేనొక సాధారణమైన మనిషిలానే కనిపిస్తున్నప్పటికీ శిరోముండనం మాత్రం చేయించుకుని ఉన్నాను. ఇట్లా శిరోముండనం చేయించుకున్న వాళ్లంతా ఇక్కడ బౌద్ధాచార్యుల్లానే పరిగణించ బడుతున్నారు. అందువల్ల నేనొక ఆచార్యుణ్ణి కాకపోయినప్పటికీ నాకు మందిరంలో ప్రవేశించడానికి అనుమతి దొరకలేదు.

ఈ లోయలో ఒకప్పుడు సైగ్యో నివాసమేర్పరచుకున్నాడంటారు. ఈ లోయలో బాగా దిగువుగా ఒక కొండవాగు ప్రవహిస్తూ ఉంది. అక్కడ కొందరు ఆడవాళ్లు కూరగాయలు కడుక్కుంటున్నారు. వాళ్లనట్లా చూస్తూంటే ఓ కవిత స్ఫురించింది: